క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేసిన బళ్లారి డిప్యూటీ మాజీ మేయర్ శశికళ

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి గ్రామంలో శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి బళ్లారి డిప్యూటీ మాజీ మేయర్ శశికళ రూ. 51,116 విరాళాన్ని అందజేశారని గ్రామ యాదవ సంఘం నాయకులు సోమవారం తెలిపారు. శశికళ, ఆమె భర్త కృష్ణమోహన్‌కు మాజీ ఎంపీపీ రాంనాథ్‌యాదవ్, మాజీ సర్పంచ్ రంగస్వామి, యాదవ కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రశాంతంగా మార్కెట్ వేలాలు

మద్దికెర : పెరవలి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మల్లికార్జున అధ్యక్షతన ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో సోమవారం దినసరి మార్కెట్ 2023–24 సంవత్సరానికి సంబంధించి సుంకం వసూలు చేయుటకు నిర్వహించిన వేలాలు ప్రశాంతంగా జరిగాయని కార్యదర్శి సుధాకర్ తెలిపారు. దినసరి మార్కెట్‌ను బావిగడ్డ హుసేన్ రూ.65 వేలుకు దక్కించుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా ఇమాంసాహెబ్ ఉరుసు

మద్దికెర : మండల కేంద్రం శివారులోనున్న ఇమాంసాహెబ్ స్వామి 321 ఉరుసు ఉత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. రాత్రి గంధం, మంగళవారం రాత్రి ఉరుసు, తెల్లవారుజామున స్వామి వారి షంషీర్ ఊరేగింపు,బుధవారం జియారత్ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రేపు 'ఆసరా' చెక్కుల పంపిణీ

తుగ్గలి: వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం 11గంటలకు జొన్నగిరిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరై డ్వాక్రా గ్రూపు సభ్యులకు మెగా చెక్కు అందజేస్తారని చెప్పారు. డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ఆలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు పక్కనున్న డిస్ట్రిక్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ గోదాము స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కేడీసీఎంఎస్ జిల్లా మేనేజర్ రాజేష్ తెలిపారు. సోమవారం ఆయన గోదాముల ఆవరణను ఆక్రమించి బంకులు ఏర్పాటు చేసుకున్న స్థలాలను పరిశీలించారు. సొసైటీకి సంబంధించి మొత్తం 39 సెంట్ల స్థలం ఉందని, ఇందులో 6 సెంట్లు గోదాము కు లారీలు రావడానికి రస్తా కోసం వదిలినట్లు చెప్పారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, ఆలూరు సీఐకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే డీసీఎంఎస్ స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. ఆలూరు కేడీసీఎంఎస్ గోదాముల ఇన్‌చార్జ్ ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

పకడ్బందీగా 'ఓపెన్' పరీక్షలు

కృష్ణగిరి: జిల్లా వ్యాప్తంగా ఓపెన్‌స్కూల్ ఇంటర్, టెన్త్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ జిల్లా మానిటరింగ్ అధికారి మైఖేల్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా కృష్ణగిరికి ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరైందన్నారు. జిల్లాలో ఓపెన్ స్కూల్‌కు సంబందించి ఇంటర్ పరీక్షలను కృష్ణగిరితోపాటు ఆదోని, పత్తికొండ–2, ఎమ్మిగనూరు–2, కర్నూలు–3 సెంటర్లలో నిర్వహిస్తున్నామని 1,892 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. అలాగే పదో తరగతికి సంబంధించి ఆదోని, ఎమ్మిగనూరు కర్నూలుతో కలిపి మొత్తం ఆరు కేంద్రాల్లో 1,254 మంది పరీక్షలు రాస్తున్నారని, పరీక్షలకు 3 ఫ్లయింగ్ స్క్వాడ్, 9 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. కాగా మండల కేంద్రంలో 170 మందికి గాను 160 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

భక్తి మార్గంలో నడవాలి

హొళగుంద: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకుంటే శాంతియుతమైన సమాజం సాధ్యమవుతుందని జంగమర హొసల్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య స్వామి భక్తులకు సూచించారు. సోమవారం రాత్రి స్థానిక సిద్దేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ్, ఆలయ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకల్బుర్గి శరణ బసవేశ్వర పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

రేపు హొళగుందకు మంత్రి రాక

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో పొదుపు మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు ఈశా, కుమారస్వామి, ఐకేపీ ఏపీఎం హనుమంతు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఆలూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈఓ కోమలాదేవి, ప్రముఖ కవి, రచయిత సవ్వప్పగారి ఈరన్న అన్నారు. స్థానిక లైబ్రరీలో సోమవారం గద్వాల సోమన్న నూతన రచన తేనెదారలు పుస్తకాన్ని లైబ్రేరియన్ నీరుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈఓ కృష్ణకుమార్, పద్య, గద్య కవి ఈశ్వరప్ప, సాంస్కృతిక పండితులు లక్ష్మన్న, రిటైర్డు ఉపాధ్యాయుడు నరసన్న, రామమూర్తినాయుడు పాల్గొన్నారు.



హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



నందవరం జెడ్పీ పాఠశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



ఎమ్మిగనూరులో విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న దృశ్యం



పరీక్షకు హాజరైన విద్యార్థులు



తుగ్గలిలో పరీక్షలు రాసి ఆనందంతో బయటకు వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

నందవరం : మండలం కేంద్రంలో పది పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు కేంద్రాలలో 380 మంది విద్యారులు గాను 373 మంది పరీక్షకు హాజరయ్యారని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సప్లిమెంటరీ విద్యార్థులు 20 మంది గాను 19 మంది హాజరైనట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రాల వద్దకు వచ్చి తమకు కేటాయించిన గదులను చూసుకుని వెళ్లారు. చీఫ్ సూపరిటెండెంట్లు నాగభూషణ రెడ్డి, దేవకృపమ్మ, శ్రీనివాసులు పరీక్షలను పర్యవేక్షించారు. సిట్టింగ్ స్క్వాడ్లు కాశయ్య, నాగరాజు, హరిప్రసాద్, సీఆర్‌పీ ఉరుకుందు పరీక్షలను తనిఖీ చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంతో పాటు బనవాసి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన 12 పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు, పోలీసులు, ప్రత్యేక అధికారులు విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపారు. మొదటి రోజు పరీక్షలకు 2,660 మంది హాజరు కావాల్సి వుండగా ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్దులు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు 706 మంది హాజరు కావాల్సి ఉండగా 696 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎగ్జామినర్లు మహబూబ్, పరమేశ్వర రెడ్డి, ముజహిద్దీన్ బాషా, రామలింగప్ప తెలిపారు.



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం

మద్దికెర : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఎంఈఓ రంగస్వామి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల కేంద్రాన్ని పరిశీలించారు.

తుగ్గలి : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 185 మంది, పెండేకల్లు రైల్వే జంక్షన్ పాఠశాలలో 206, జొన్నగిరిలో 184, తుగ్గలి అనసూయ జూనియర్ కాలేజీలో 96 మంది హాజరు కావాల్సి ఉండగా, పెండేకల్లులో ఆరుగురు, తుగ్గలి రెండు కేంద్రాల్లో ఇద్దరు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజనేయులు, తుగ్గలి కేంద్రాన్ని పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తనిఖీ చేశారు.

ఆలూరు రూరల్: పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆలూరులోని జెడ్పీ బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల–1,2 స్థానిక సెయింట్ జాన్స్, మోడల్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలలో 42 గదులు ఏర్పాటు చేశారు. తొలి రోజు 848 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 825 మంది హాజరయ్యారని ఎంఈఓ కోమలాదేవి తెలిపారు.

ఆస్పరి: స్థానిక హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 660 మంది విద్యార్థులకు గాను 655 మంది హాజరైనట్లు ఏంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పత్తికొండ రూరల్ :పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 992 మందికి గాను 972 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కృష్ణగిరి: మండలంలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కృష్ణగిరి, కంబాలపాడు గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలను ఫ్లయ్యింగ్ స్క్వాడ్ గోవిందురెడ్డి తనిఖీ చేశారు. మూడు కేంద్రాల్లో 554 మంది విద్యార్థులకు గాను 551 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



ఆలూరు ప్రభుత్వ బాలుర–1 పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

వెల్దుర్తి: స్థానిక 4 పరీక్ష కేంద్రాల్లో సోమ వారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 862 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. 8మంది గైర్హాజరయ్యారన్నారు. కర్నూలు దిశ డీఎస్పీ వెంకట్రామయ్య, వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు.

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు, కేజీబీవీ, కన్నడ ఎలిమెంటరీ పాఠశాలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం నాలుగు పరీక్ష కేంద్రా లనును ఏర్పాట్లు చేశారు. మొత్తం 570 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 563 మంది పరీక్షలు రాశారని పరీక్షల చీఫ్‌లు కరిబసప్ప, శ్రీనారాయణ, రమణయ్య, హుసేన్‌సాహెబ్ తెలిపారు. మొదటి రోజు కన్నడ, తెలుగు, ఉర్దూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు.



ఆస్పరిలో పరీక్షలకు హజరైన విద్యార్థులు



హొళగుంద కన్నడ పరీక్షకు హాజరైన విద్యార్థులు



ప్రశ్న పత్రంపై టీచర్‌తో చర్చిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు



పత్తికొండలో గురుకులం పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకుని గేటు బయట ఉన్న విద్యార్థులు



వెల్దుర్తిలో సమయం ముగుస్తుండటంతో పరిగెత్తుకు వస్తున్న విద్యార్థిని

రోడ్డు విస్తరణపై ఆర్డీఓ సమావేశం



దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

పత్తికొండ రూరల్ : పట్టణంలో రోడ్డు విస్తరణపై ఆర్డీఓ మోహన్‌దాస్ రోడ్డు కిరువైపులా ఉన్న దుకాణాల యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ తాము రోడ్డు విస్తరణకు పూర్తిగా సహకరిస్తామని అయితే రోడ్డు వెడల్పు కొలతలను తగ్గించాలని కోరారు. మరికొందరు పంచాయతీకి అనుగుణంగా రోడ్డు వెడల్పు చేపట్టి పట్టణ రోడ్డు–బైపాస్‌రోడ్డు రోడ్డు వన్‌వేగా మార్చాలన్నారు. రోడ్డుకిరువైపులా ఉన్న షాపుల యజమానులు వారి ముందున్న పంచాయతీ స్థలాలను అద్దెకు ఇచ్చి వారి నుంచి అద్దెలు వసూలు చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం నిర్ణయించిన రోడ్డు వెడల్పునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఆర్‌అండ్‌బీ డీఈ నాగవెంకటేశ్వరరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషం





సమావేశానికి హాజరైన పొదుపు మహిళలు, పొదుపు మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, మరోసారి ఆయనను సీఎంగా గెలిపించుకుంటే పేదలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతారని వైఎస్సార్‌సీపీ నేత గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న ఇబ్రహీమ్ కాంప్లెక్స్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత ఆసరా పథకం కింద 621 పొదుపు గ్రూపులలోని 6,112 మంది లబ్దిదారులకు రూ 3,04,31,00 కోట్ల మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఈరన్న, వైస్ ఎంపీపీ నాగ వేణి, ఎంపీటీసీలు బోయ యల్లమ్మ, మోతి జంగాల యల్లమ్మ, జీరా నాగమ్మ, మండల కో–ఆప్షన్ మెంబర్ బాషా, కో–కన్వీనర్ హనుమయ్య, ఎంపీటీసీ దేవరాజ్, సర్పంచ్ దేవిరెడ్డి, నాయకులు శ్రీధర్, భాషా, దీపక్ కుమార్, చంద్రన్న, ఈరన్న, మల్లికార్జున, వరుణ్, సోము, శేఖర్, ఎంపీడీఓ అల్లబకాష్, ఏసీ నవీన్ కుమార్, ఏపీఎంలు శివయ్య, ఆంజనేయులు, సీసీలు పాల్గొన్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ నిరాటంకంగా అందాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అంతకముందు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

నందవరం: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి అన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ సఫరున్నీసా బేగం, ఏసీడీపీఓ మద్దమ్మ నేతృత్వంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్యలత హాజరయ్యారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాలతో వంటకాలను పరిశీలించారు. అలాగే చిరుధాన్యాలతో తీర్చిదిద్దిన పోషణపక్వాడా లోగోను తిలకించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జెర్మియా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, రాజ్యలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోషణ పక్వాడా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

బాధితులకు న్యాయం చేస్తాం

నందవరం:జగనన్న కాలనీ పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ నిత్యానందరాజు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హాలహర్వి గ్రామానికి చెందిన 38 మంది లబ్ధిదారులు తమ ఇళ్ల స్థలాలను ఆక్రమణదారుల చెర నుంచి విడిపించి తమకు అప్పగించి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. హాలహర్విలో గ్రామ కంఠం భూమి సర్వే నంబర్ 407లో జగనన్న కాలనీ ఏర్పాటు చేసి 38 మందికి పట్టాలు ఇచ్చింది వాస్తమేనన్నారు. ఆక్రమణదారులకు ఇప్పటి వరకు నోటీసులు జారీ చేశామని, రెండు సార్లు నోటీసులు జారీ చేసి పోలీసు ప్రొసీడింగ్‌తో స్థలాలను ఖాళీ చేయించి బాధితులకు అప్పగిస్తామని తెలిపారు. ఆర్‌ఐ జెర్మియా, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, రంగన్న, తెనాలి రామకృష్ణ, షరీఫ్, జయరాజు, శాంతిరాజు, ఈరన్న, బాధితులు హనుమంతమ్మ, నాగవేణి, రాములమ్మ, లక్ష్మీ, ఈరమ్మ, సావిత్రి, శివమ్మ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

పశువుల పాక దగ్ధం

తుగ్గలి: మండలంలోని పై చింతలకొండ రైతు రామన్న పశువుల పాకకు ఆదివారం రాత్రి నిప్పంటుకొని దగ్ధమైంది. పాకలోనున్న పొయ్యిలో నిప్పులు సరిగా ఆర్పకుండా వదిలేయడంతో కాసేపటికి మంటలు చెలరేగి పాక పూర్తిగా కాలిపోయింది. పాకలో ఉన్న ఎద్దు, 3మేకలు ,30 కోళ్లు చనిపోగా మరో ఎద్దు తీవ్రంగా గాయపడింది. వ్యవసాయ పరికరాలు, నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేపోయింది. దాదాపు రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న వీఆర్వో రామాంజనేయులు, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ పుష్పావతి, గౌరవ సలహాదారు రవి సోమవారం ఘటన స్థలానికి చేరుకొని బాధిత రైతును ఓదార్చి రూ.10వేలు సాయమందించారు.



కాలి పోయిన ఎద్దు, మేకలను చూస్తున్న బాధిత రైతు రామన్న

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

పత్తికొండ రూరల్: ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారంనాగరాజు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరితో రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించి వేస్తుందని మండిపడ్డారు. నియంతృత్వ పోకడలను సమైక్యంగా అడ్డుకోవాలని కోరారు. అఖిలపక్ష నాయకులు రాజశేఖర్, రామనాయుడు, గుడిసె నరసింహుడు, కారుమంచి, రంగారెడ్డి, కారన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు తగదు

పత్తికొండ రూరల్ : ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై అనవసరమైన ఆరోపణలు చేయడం తగదని ఎంపీపీ నారాయణదాస్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనుచరులు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, భూదందాలకు పాల్పడుతున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలను వెలికితీయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి కాని ప్రతి విషయాన్ని ఎమ్మెల్యేకు ఆపాదించి ప్రచారం చేయడం సరికాదన్నారు. జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, మండల కన్వీనర్ కారం నాగరాజు, పెద్దహుల్తి నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాస్

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: ఎల్లార్తి గ్రామానికి చెందిన ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్‌జహీర్ సోమవారం తెలిపారు. దర్గాల వెనుక భాగంలోని చెరువ కట్ట వద్ద పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకుని వారి నుంచి రూ.4,570 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

కృష్ణగిరి: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించారు. అర్జీలను శాఖల వారీగా అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా గరుడ ప్రభోత్సవం

వెల్దుర్తి: రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు గరుడోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభపై గరుడ వాహనాన్ని ఉంచారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని గరుడిడిపై ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు

వెల్దుర్తి: పేరేముల గ్రామంలో చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం సందర్భంగా సోమవారం న్యూ కేటగిరి రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించగా నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలం టి. హుసేనాపురం వృషభాలు విజేతలుగా నిలిచి రూ.40వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా డోన్ మండలం సీసంగుంతల ఆల మధుసూధన్ రెడ్డి వృషభాలు, డోన్ కొత్తకోట తలారి కాంత్, పీఆర్‌పల్లె రాజశేఖర్ వృషభాలు సంయుక్తంగా, హుసేనాపురం రామసుబ్బారెడ్డి, బళ్లారి రమేశ్ వృషభాలు సంముక్తంగా, అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం శంకర్‌నాయక్ వృషభాలు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు గెలుచుకున్నాయి. సర్పంచ్, నిర్వాహకులు, దాతలు బహుమతులందజేశారు.

విద్యార్థులకు అండగా ప్రభుత్వం

ఆలూరు రూరల్: భవిత కేంద్రాల్లో చదివే దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కర్నూలు జిల్లా సహిత విద్య కేంద్రాల కో–ఆర్డినేటర్ విజయ్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆలూరులోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడూతూ ఆలూరు భవిత కేంద్రంలో చదివే 169 విద్యార్థులకు 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.4,22,000 విడుదల చేసిందన్నారు. ప్రతి నెల రూ.3 వందల చొప్పున 36 మందికి ఎస్కార్ట్ అలెవెన్స్, 85 మందికి ప్రతి నెల రూ.2 వందలు స్టైఫండ్, 39 మంది విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు అలెవెన్స్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ కింద ఏడుగురికి నెలకు రూ.300 ప్రకారం విడుదల చేసిందన్నారు. పది నెలలకు సంబంధించిన మొత్తం నగదు రాష్ట్ర ప్రభుత్వం వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తుందని చెప్పారు. జిల్లా సహిత విద్య సహాయ సమన్వయకర్త వాణి ఆలూరు సహిత విద్యాకేంద్రం ఉపాధ్యాయులు రామదాసు, అరుణ జ్యోతి ఉన్నారు.

ఎట్టకేలకు అంత్యక్రియలు

గోనెగండ్ల: మండలంలోని బి. అగ్రహారం గ్రామంలో శ్మశానవాటిక సమస్య నెలకొంది. సోమవారం రాజశేఖర్ అనే యువకుడు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్థలం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇబ్బందిపడ్డారు. దీంతో మృతదేహాన్ని సాయంత్రం పొద్దుపోయే వరకు ఇంటి దగ్గరే ఉంచుకున్నారు. గతంలో గ్రామ శివారులో బెల్లం చిన్న హనుమంతు అనే వ్యక్తి పట్టా పొలంలో గ్రామస్తులు శ్మశానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే కొన్ని నెలలుగా ఆయన తన పొలంలో పంటలు సాగు చేయడం ప్రారంభించాడు. దీంతో అంత్యక్రియలకు అవకాశం లేకుండా పోవడంతో గ్రామస్తులు తహసీల్దార్‌ను ఆశ్రయించగా ఆయన పరిశీలించి గ్రామ శివారులో 40 సెంట్ల స్థలం చూపారు. అయితే అక్కడికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో వారు ఒప్పుకోలేదు. ఈ క్రమంలో రాజశేఖర్ మృతి చెందటంతో చిన్న హనుమంతు పొలంలో అంత్యక్రియలకు గుంత తవ్వడానికి యత్నించగా ఆయన అడ్డుకున్నాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ తిమ్మారెడ్డి గ్రామానికి చేరుకొని కొత్త శ్మశాన వాటిక కోసం సర్వే నంబర్ 244లో కొంత స్థలాన్ని చూపించారు. దీంతో అక్కడ అంత్యక్రియలు చేపట్టారు.